

# మహా మానవవాది ఎమ్.ఎన్.రాయ్

## – నరిసెట్టి ఇన్నయ్య



(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

-5-

## మెక్సికోలో చరిత్ర సృష్టించిన ఎమ్.ఎన్.రాయ్



మెక్సికోలో ఎమ్.ఎన్.రాయ్ దంపతులు రెండేళ్ళపాటు ఉన్నా ఆ కొద్ది కాలంలో చరిత్ర సృష్టించారు. ప్రప్రధమంగా మెక్సికో సోషలిస్టు పార్టీని స్థాపించడమే కాక దానికి ప్రధాన కార్యదర్శిగా ఎమ్.ఎన్.రాయ్ ఉండడం, దేశాధ్యక్షులు కరంజా ఆమోదాన్ని పొందడం గొప్ప పరిణామం. ఆ వార్త అటు అమెరికాకు, ఇటు రష్యాకు చేరింది. రష్యాలో కమ్యూనిస్టు నాయకులు ముఖ్యంగా లెనిన్ దీనిని ఆహ్వానించారు. అమెరికాలో ఉంటున్న రష్యా కమ్యూనిస్టులు బరోడిన్ ఆ వార్తను తెలుసుకొని స్పందించారు. మెక్సికో వెళ్ళి ఎమ్.ఎన్. రాయ్ ని కలుసుకోవలసిందిగా లెనిన్ కబురుచేయడంతో బరోడిన్ తక్షణమే బయల్దేరి మెక్సికో సిటీ వచ్చారు. అప్పటికే ఎమ్.ఎన్.రాయ్ పై విమర్శలు చేస్తున్న పత్రిక బరోడిన్ దృష్టికి వచ్చింది. గేల్ అనే వ్యక్తి క్రైస్తవ ప్రచారకుడిగా ఆ పత్రిక నడుపుతూ అందులో రాయ్ పై అవాకులు చవాకులు పేలాడు. మరొకవైపు ఎల్ హెరాల్డో పత్రిక ఎమ్.ఎన్.రాయ్ వ్యాసాలను ప్రధానంగా ప్రచురించింది. బరోడిన్ ఆ పత్రికా కార్యాలయానికి వెళ్ళి తనను పరిచయం చేసుకుని లెనిన్ పంపగా తాను వచ్చానని రాయ్ ని కలుసుకోవాలని కోరాడు. మెక్సికో సోషలిస్టు నాయకుడు ఇర్విన్, చార్లీ ఆ విషయం తెలుసుకుని ఆనందంగా హడావిడిగా రాయ్ కు చెప్పారు. రష్యాలో కమ్యూనిజం, బోల్షివిక్ నాయకత్వం గురించి విన్న మెక్సికో సోషలిస్టులకు బరోడిన్ రాక ఆనందాన్ని ఆశ్చర్యాన్ని కొల్పింది. మర్నాడు బరోడిన్ ను కలుసుకోవడానికి రాయ్ అతడు దిగిన హోటల్ కు వెళ్ళి పరిచయం చేసుకున్నాడు. రాయ్ ను చూసి అతడు యువకుడుగా వుండటం గమనించి బరోడిన్ ఆశ్చర్యపోయాడు. ఒక సాధారణ హోటల్ లో మామూలు దుస్తులలో బరోడిన్ ఉండడాన్ని రాయ్ గమనించాడు. మొత్తం మీద ఇరువురూ పరస్పరం పరామర్శించుకుని మళ్ళీ కలుసుకోవడానికి ఏర్పాటు చేసుకున్నారు. బరోడిన్ పరిస్థితిని తెలుసుకుని అతని దగ్గర డబ్బేమీ లేదని గ్రహించి హోటల్ కు చెల్లించే స్థితి కూడా లేదని తెలిసిన రాయ్ తన ఇంటికి వచ్చి వుండమని ఆహ్వానించాడు. ఆనందంగా ఆహ్వానాన్ని అందుకున్న బరోడిన్ బస మార్చి రాయ్ ఇంట్లో పై భాగంలోకి తన సూట్ కేసు టైప్ రైటరు చేరవేసుకున్నాడు.



బరోడిన్



గేల్



మెక్సికోలో మొదటిసారిగా కమ్యూనిస్టు పార్టీని ప్రారంభినప్పుడు (1917-19)

బరోడిన్ కు విప్లవ చరిత్ర వున్నది. అతన్ని బ్రంట్ విన్ అని, మైకెల్ గ్రూజన్ బర్గ్ అని పిలుస్తారు. లెనిన్ కు మాత్రం బ్రంట్ విన్ అని బాగా తెలుసు. 1905 నుండి రష్యాలో జారు చక్రవర్తుల నిరంకుశ పాలనపై పోరాటం జరిపిన కమ్యూనిస్టులలో లెనిన్ అనుచరుడుగా బరోడిన్ వున్నాడు. దేశం నుండి కమ్యూనిస్టులు ఇరుగుపరుగు దేశాలకు పలు ప్రాంతాలకు పారిపోవలసి వచ్చింది. అలా పారిపోయిన వారిలో బరోడిన్ అమెరికా చేరుకుని అక్కడే పెళ్ళి చేసుకుని ఇద్దరు సంతానాన్ని కన్నాడు. కానీ, లెనిన్ తో కమ్యూనిస్టులతో నిరంతర సంబంధాలు పెట్టుకున్నాడు. అమెరికాలో ఉంటూ కొందరు జర్మనులకు భాషను నేర్పటం మరికొన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టటంతో కాలం గడిపాడు. ఆ విధంగా రష్యాలో జారు చక్రవర్తులు ఓడిపోయి కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చేవరకూ వున్నారు. ఆ సన్నివేశంలోనే మెక్సికోలో తొలిసారి సోషలిస్టు పార్టీని రాయ్ స్థాపించడం, లెనిన్ కబురుతో మెక్సికో రావడం జరిగింది. బరోడిన్ బహుభాషావేత్త అని, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని బాగా అవగాహన చేసుకున్నవాడని రాయ్ గ్రహించాడు. సిద్ధాంత రీత్యా కమ్యూనిస్టు మౌలిక విషయాలు, గతితార్కిక భౌతిక వాదం రాయ్ కు వివరించి క్రమేణ అతన్ని కమ్యూనిజం వైపుకు తిప్పగలిగారు. సోషలిస్టు పార్టీని మెక్సికోలో స్థాపించి నందుకు అభినందిస్తూ దానిని కమ్యూనిస్టు పార్టీగా మార్చమని సలహా ఇచ్చాడు. రాయ్ అందుకు సుముఖత వ్యక్తం చేశాడు.




సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా రాయ్ మెక్సికోలో పర్యటనలు జరిపాడు. సోనోరా రాష్ట్రంలో ఉన్న చార్లీని పలకరిస్తూ ప్రచారం చేసాడు. సోనోరా రాష్ట్రం అమెరికా సరిహద్దుల్లో వున్నది. అక్కడి సమస్యలు కూడా జటిలమైనవి. రాయ్ పర్యటనకు పూనుకున్నప్పుడు జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు కూడా. మొత్తం మీద పర్యటన పూర్తి చేసుకుని తిరిగి వచ్చేసరికి బరోడిన్ రావడంతో కొత్త మలుపులు తిరిగాయి.

బరోడిన్ ను మెక్సికో అధ్యక్షుడు కరంజాకు పరిచయం చేసిన రాయ్ అతన్ని గురించి వివరంగా తెలిపారు. ఆ సందర్భంగా ఉన్న ఛాంబర్ ఆఫ్ డెప్యూటీస్ అధ్యక్షుడు దాన్ మాన్యువల్, యూనివర్సిటీ రెక్టార్ మాస్ట్రో కాసోస్ ను రాయ్ పట్ల బాగా ఆకర్షితులయ్యారు. రాయ్ ని తన యూనివర్సిటీ నుంచి వచ్చి కాపాడవలసిందిగా రెక్టార్ కోరాడు. ఆ ప్రకారమే రాయ్ ప్రసంగాలు చేసి వారిని ఆకట్టుకున్నారు.

**EL HERALDO**
**de Chihuahua**

జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు బరోడిన్ ద్వా◌ారా, రష్యాకు తెలుస్తూ వచ్చాయి. కొత్త కమ్యూనిస్టు మానిఫెస్టోను మెక్సికో సోషలిస్టు పార్టీ ఆమోదించింది. అంతేగాక మెక్సికో పార్టీని అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీని నిబంధన చేయడానికి కూడా అంగీకరించింది. మాస్కోలో జరగబోయే అంతర్జాతీయ ద్వితీయ కాంగ్రెస్ కు ప్రతినిధి వర్గాన్ని పంపటాని◌ికి కూడా సిద్ధ పడింది. ప్రత్యేక మెక్సికో పార్టీ సమావేశం ఏర్పాటు చేసి అందులో కొత్తగా తీర్మానం చేశారు. మెక్సికో సోషలిస్టు పార్టీని పేరు మార్చి కమ్యూనిస్టు పార్టీగా పిలవడానికి అంగీకరించారు. ఆ కొత్త పార్టీకి ఎమ్.ఎన్.రాయ్ కార్యదర్శిగా వుండాలని కూడా తీర్మానించారు. అంతర్జాతీయ సమావేశానికి మెక్సికో నుండి ప్రతినిధులుగా ఇరువురిని పంపించాలని నిర్ధారించారు. అందువలన తాత్కాలికంగా రాయ్ కార్యదర్శిగా తప్పుకుని మరొకరిని నియమించాలనుకున్నారు. రష్యా వెళ్ళే ప్రతినిధులలో రాయ్ ని అతని భార్య ఎవిలిన్ ని ఎంపిక చేశారు. అంతటితో రాయ్ జీవితంలో మరొక మలుపు తిరిగింది. 1919 వేసవిలో ఈ పరిణామం సంభవించింది. రష్యా వెళ్ళటానికి రాయ్ సిద్ధపడ్డాడు. ఆయన జీవితంలో మరొక మార్పుకు నాంది పలికింది. రెండున్నర సంవత్సరాలు మెక్సికోలో గడిపిన రాయ్ దంపతులు ఆ దేశానికి వీడ్కోలు పలకవలసి వచ్చింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ ఆదేశాల మేరకు బరోడిన్ ముందుగా వెళ్ళి బెర్లిన్ లో రాయ్ దంపతుల రాకకోసం ఎదురు చూడవలసిన నిర్ణయం తీసుకున్నారు. 1920 వసంత కాలంలో జరగనున్న ద్వితీయ అంతర్జాతీయ సభలలో రాయ్ దంపతులు హాజరు కావలసి వున్నది.

(కొనసాగింపు వచ్చే సంచికలో)